క్లుప్తంగా

సీఎం పర్యటనకు తరలిరావాలి

ఖానాపూర్: ఆదిలాబాద్‌లో ఈనెల 22న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తారని.. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లాధ్యక్షుడు గోవింద్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాసమల్ల అశోక్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి సుగుణ నామినేషన్‌కు సీఎం హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను గెలిపించాలి'



కూలీలతో మాట్లాడుతున్న దుర్గాభవాని

కడెం: కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చొప్పదండి దుర్గాభవాని అన్నారు. ఆదివారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్, నర్సాపూర్ గ్రామల్లో ఉపాధిహామీ పనుల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఇందులో జలజ, శారద, రమా తదితరులు ఉన్నారు.

మహాలక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

ముధోల్: మండలంలోని వడ్తాల్ గ్రామంలో ఆదివారం నూతన మహాలక్ష్మీ దేవిగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసిప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలకు వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న బాసర గ్రామస్తులు

భైంసా: బాసర ఆలయంలో స్టోర్‌రూంలో, ప్రసాద కౌంటర్లలో పెరుగుతున్న అవినీతిపై ఇటీవల మీడియాలో వచ్చిన కథనాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాసర గ్రామస్తులు జిల్లా ఇన్‌చార్జి, మంత్రి సీతక్కను కోరారు. ఆదివారం బాసరకు వచ్చిన సీతక్కను కలిసి వినతిపత్రం ఇచ్చారు. బాసర ఆలయంలో కొందరు అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారుల చర్యలతో ఆలయ ప్రతిష్ట దిగజారుతుందని.. తక్షణం అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాబా విగ్రహ ప్రతిష్ఠాపన

మామడ: మండలంలోని కొరిటికల్‌లో ఆదివారం దత్తసాయి మందిరంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. అర్చకులు గురుమంచి చంద్రశేఖర్ ప్రవచనాలతోపాటు ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయం ఆవరణలో అన్నదానం చేశారు. సాయి సేవాదీక్ష సమితి జిల్లా అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి రూ.2లక్షలు విరాళం అందించగా విగ్రహం కొనుగోలు చేశారు. అనంతరం విగ్రహదాతను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ నల్ల లింగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రచార సామగ్రి అందజేత

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ కరపత్రాలు, ప్రచార సామగ్రిని సత్తనపల్లి, తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులకు అందించినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్ ఆధ్వర్యంలో అందించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. రమేష్, తోట సత్యం, పుప్పాల శంకర్, లక్ష్మీపతి గౌడ్, రమేశ్‌నాయక్ ఉన్నారు.

ప్రశాంతంగా ప్రవేశపరీక్షలు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన బీఎల్‌వీ ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పాఠశాలలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశం కోసం 241మంది విద్యార్థులకు గాను 216మంది హాజరవగా.. 25మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రమాకల్యాణి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

సారంగపూర్: మండలంలోని సారంగాపూర్-మలక్‌చించోలి ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురు వాహన చోదకులు పట్టుబడగా.. మూడు కేసులు నమోదు చేశామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తనిఖీల్లో మద్యం సేవించి నడిపిన వారిపై దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.

యూనిఫాంల బాధ్యత ఎస్‌హెచ్‌జీలకే..

- పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న మహిళా సంఘాలు
- వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం వరకు సిద్ధం కానున్న దుస్తులు



లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ హైస్కూల్‌లో డ్రెస్ కొలతలు తీసుకుంటున్న సంఘాల సభ్యులు

మామడ: ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు యూనిఫాంలను అందించే బాధ్యతను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు అప్పగించింది. పాఠశాలల ఆరంభం వరకు విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలను అందించనున్నారు.

విద్యాసంవత్సరం ప్రారంభంలోగా..

జిల్లాలోని 756 ప్రభుత్వ పాఠశాలలలో 52,264 మంది విద్యార్థులు చదువుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం జూన్ 12న ప్రారంభం అవుతుంది. ఆరంభంలోనే విద్యార్థులకు యూనిఫాంలతోపాటు పాఠ్యపుస్తకాలను అందిస్తే విద్యార్థులకు చదువులో ఆటంకం కలగకుండా చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ విద్యాసంవత్సరం చివరి వరకు ఈనెల 23లోపు మహిళా సంఘాలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని ఐకేపీ సంఘాలకు ఆదేశాలు అందాయి.

సరిపోని కుట్టు చార్జీలు..

విద్యార్థులకు ప్రతి ఏటా రెండు జతల యూనిఫామ్‌లను అందిస్తున్నారు. ఒక్కో జత యూనిఫాం స్టిచ్చింగ్(కుట్టు) కోసం రూ.50 చొప్పున రెండు జతలకు రూ.100లు మహిళా సంఘానికి అందిస్తారు. ప్రభుత్వం అందించే స్టిచ్చింగ్(కుట్టేందుకు) చార్జీలు సరిపోవని గ్రామ సమైఖ్య సంఘాలు పేర్కొంటున్నాయి. గతేడాది వరకు పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను అందించే బాధ్యతను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించేవారు. పాఠశాల విధులతోపాటు ఈ పనులు భారం కావడంతో యూనిఫాంల బాధ్యతను గ్రామ సమైఖ్య సంఘాలకు అప్పగించారు. గతేడాది స్టిచ్చింగ్ చార్జీలు గిట్టుబాటు కావడం లేదని సకాలంలో స్టిచ్చింగ్ చేయకపోవడంతో యూనిఫామ్‌లు అందించడం ఆలస్యమైంది. ఈ విద్యాసంవత్సరం ఎలాంటి అవరోధాలు ఉండకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పాఠశాల ఆరంభం వరకు యూనిఫాంలు



విద్యాసంవత్సరం ఆరంభం వరకు విద్యార్థుల యూనిఫాంలు పాఠశాలలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. స్వయం సహాయక సంఘాలకు విద్యార్థుల సంఖ్య, వివరాలు అందించాము.

– రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

అవగాహన కల్పిస్తున్నాం



మామడ మండలంలో 40 గ్రామ సమైఖ్య సంఘాలున్నాయి. విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందించేలా ఉన్నతాధికారుల ఆదేశాలతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. సభ్యులు పాఠశాలలకు వెళ్లి క్షేత్రస్థాయిలో వివరాలు నమోదు చేస్తున్నారు. యూనిఫాం స్టిచ్చింగ్ చార్జీలు కొంత పెంచి ఇవ్వాలని గ్రామ సమైఖ్య సంఘాలు కోరుతున్నాయి.

– అరుణ, సెర్ప్ ఏపీఎం, మామడ

హైదరాబాద్‌లో నిర్మల్ కవుల కవితాగానం



కవితలు చదువుతున్న నేరేళ్ల హనుమంతు

నిర్మల్‌ఖిల్లా: హైదరాబాద్‌లో ఉన్న లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెక్యులర్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, ఉపాధ్యక్షుడు అంబటి నారాయణ కవితాగానం చేశారు. ప్రజాస్వామిక, లౌకిక, రాజ్యాంగ విలువల పరిరక్షణే లక్ష్యంగా 12 గంటల సామూహిక కవితాగానం కవిసమ్మేళనంలో నిర్మల్ కవులు తమ కవితల్ని వినిపించారు. మత సామరస్యంపై నేరెళ్ల హనుమంతు, సామాజిక సాంస్కృతిక అంశంపై అంబటి నారాయణ చదివిన కవితలు ఆకట్టుకున్నాయి. సభాధ్యక్షులుగా సూఫీ, ప్రత్యేక ఆహ్వానితులుగా కందుకూరి శ్రీరాములు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు తుమ్మల దేవరావు, వెంకట్, పోలీస్ భీమేశ్, పత్తి శివప్రసాద్, కామారపు జగదీశ్వర్, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు తదితరులు వీరిని అభినందించారు.

గాండ్ల తేలికుల సంఘం కార్యవర్గం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నిర్మల్: గానుగతో నూనె తయారు చేసే గాండ్ల తేలి కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్మల్ పట్టణ గాండ్ల తేలి కులసంఘం అధ్యక్షుడు వోస మహేందర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా నిర్మల్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వోస మహేందర్, ప్రధాన కార్యదర్శిగా విఠల కిరణ్, ఉపాధ్యక్షులుగా రాసమల్ల గణేశ్, రాచబత్తుల రాజ్‌కుమార్, కార్యదర్శులుగా కాసుమోహన్, ఆసపు సతీశ్, సంయుక్త కార్యదర్శిగా రాసం స్వహేందర్, కోశాధికారిగా బోడ్కె గంగాప్రసాద్, ప్రచార కార్యదర్శిగా వోస శ్రీనివాస్, సభ్యులుగా గంగాధర్, కల్యాణ్, మచ్చేందర్, లక్ష్మణ్, అశోక్, ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. కులవృత్తులను కాపాడే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని.. సంఘం తరఫున కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత

సారంగపూర్: వాహనాల తనిఖీల్లో భాగంగా మండలంలోని మహారాష్ట్ర-సిర్పెల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న రెండున్నర క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్నామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. టీవీఎస్‌ఎక్సెల్ వాహనంపై మహారాష్ట్రలోని షివిని గ్రామానికి బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాహనం సీజ్ చేసి బియ్యం తహసీల్దార్ శ్రీదేవికి అప్పగించినట్లు వెల్లడించారు.

తండ్రి జ్ఞాపకార్థం చలివేంద్రం

నిర్మల్: తాను పని చేస్తున్న శాఖలోనే పని చేసిన తన తండ్రి జ్ఞాపకార్థం ఒక ఉద్యోగి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో జేఏటీగా పని చేస్తున్న దీపతి శ్రీనివాస్ స్థానిక విద్యుత్ వినియోగదారుల కేంద్రం వద్ద ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. సీఈ కేఎస్ గుప్త, ఎస్ఈ జేఆర్ చౌహాన్, డీఈలు శ్రీనివాస్‌రావు, నాగరాజు, ఇతర సిబ్బంది కలిసి దీన్ని ప్రారంభించారు. తన శాఖలోనే లైన్‌మన్‌గా చేసిన తండ్రి దీపతి కృష్ణ జ్ఞాపకార్థం సొంతఖర్చులతో శ్రీనివాస్ ఈ కేంద్రాన్ని కొనసాగించడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు.

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



పొన్కల్‌లో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు విజయ్‌స్వామి, రామచంద్రచార్యులు వేదమంత్రోచ్చరణల నడుమ జరిపించిన కల్యాణానికి భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

డీసీసీ అధ్యక్షుడి పూజలు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయం, కొరిటికల్ సాయిబాబా ఆలయాల్లో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పొన్కల్‌లో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా.. కొరిటికల్‌లో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో లింగారెడ్డి, గంగారెడ్డి, లింగన్న, శేఖర్, శ్రీనివాస్, భూమేశ్వర్, సుదర్శన్, వికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవ) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పుప్పాల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరి రాములు, కోశాధికారిగా బలగం రాజేందర్, ఉపాధ్యక్షుడిగా చిలువేరి వెంకట్రాములు, సంయుక్త కార్యదర్శిగా తునికి మారుతి, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్, మహిళా కార్యదర్శులుగా హారిక, రజిత, గౌరవ అధ్యక్షులుగా గంగన్న, విజయప్రకాష్, భూమన్న, మునీందర్, గౌరవ సలహాదారులుగా బలగం రాజన్న, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం రెండేళ్లపాటు ఉంటుందని నాయకులు తెలిపారు.

నూతన నియామకం

నిర్మల్‌టౌన్: హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ జిల్లా వైస్ చైర్మన్‌గా పల్లి సుభాశ్‌ను నియమించినట్లు హ్యూమన్ రైట్స్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఆయనకు నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్, సభ్యులు అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



భైంసారూరల్ : ప్రచారం చేస్తున్న నాయకులు

కడెం: ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని దిల్దార్‌నగర్, మాసాయిపేట్,పాండ్వపూర్, కన్నాపూర్, ధర్మాజీపేట్, నర్సాపూర్, మద్దిపడగ, అంబారిపేట్ గ్రామాల్లో ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో మందపల్లి రమేశ్, జక్కుల సత్తెన్న, ఇస్లావత్ మోహన్ నాయక్, వేణు, బుర్ర సాయికుమార్, ప్రసాద్, భీమన్న తదితరులు ఉన్నారు.

దేగాంలో..

భైంసారూరల్: ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని దేగాం గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశం సాధిస్తున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ మోర్చా మహిళా అధ్యక్షురాలు సుష్మారెడ్డి, పండిత్‌రావుపటేల్, కిష్టన్న, చంద్రకాంత్‌పటేల్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

అడెల్లి ఆలయంలో భక్తుల సందడి



నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

సారంగపూర్: మండలంలోని శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. జిల్లాతోపాటు నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహారాష్ట్ర నుంచి శనివారం అర్ధరాత్రి నుంచే భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.





భగీరథ.. ఇదేం వృథా

జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ నుంచి గాంధీ చౌక్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైపు మ్యాన్ హోల్ లీకేజ్‌తో కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతోంది. రోడ్డుపై నీరు చేరడంతో గుంతలమయమై అధ్వానంగా మారింది. ఈ రోడ్డుగుండా రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మ్యాన్ హోల్ లీకేజీ త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



నిర్మల్‌లో ప్రచార రథాలు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు

ముధోల్: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఆదివారం ముధోల్‌లో ఆదిలాబాద్ జెడ్పీటీసీ జనార్ధన్ రాథోడ్, స్థానిక నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని..మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలని కో రా రు.

దస్తురాబాద్: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలిన ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రచార రథాన్ని నాయకులు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ రాజునాయక్, బీఆర్‌ఎస్ నాయకులు గోపి, రాజనర్సయ్య, లక్ష్మీ, గంగన్న, మాణిక్యరావ్, రాములు, రాజేశ్, అనిల్, సురేశ్‌నాయక్, శ్రీనివాస్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచార రథాలు ప్రారంభం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎన్నికల ప్రచారం చేసే పార్టీ రథాలను ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి-రాంకిషన్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, నజీరుద్దీన్, రిజ్వాన్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి చరిత పారాయణం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని రామారావుబాగ్ కాలనీలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత పారాయణం ప్రారంభించారు. వరంగల్ ప్రాంతానికి చెందిన సోమనారాయణ చారి కళాకారులు వీరబ్రహ్మేంద్రస్వామి కథనం వివరించారు. ఐదు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు బ్రహ్మంగారి చిత్రపటానికి పూజలు చేసి ప్రవచనాలు ప్రారంభించారు. బ్రహ్మంగారి కథ కార్యక్రమం తిలకించేందుకు ప్రజలు తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

మండు వేసవిలో నిండుకుండలా..



ప్రస్తుత వేసవిలో మండుతున్న ఎండలకు చెరువులు, కుంటల్లో నీరు ఇంకిపోతోంది. కానీ లక్ష్మణచాంద మండల ప్రజలు వరప్రదాయినిగా భావించే సరస్వతి కాలువకు నీరు విడుదలవుతుండటంతో సదర్మాట్ కోసం కనకాపూర్ వాగులోకి నీటిని వదులుతున్నారు. దీంతో కనకాపూర్ వాగుపై బాబాపూర్ వద్ద గల ఆనకట్ట, హకీం చెరువు అలుగు దుంకి పారుతోంది. దీంతో కనకాపూర్ వాగు నిండుకుండలా ప్రవహిస్తోంది.

– లక్ష్మణచాంద





కొండగట్టుకు స్వాముల పాదయాత్ర



లక్ష్మణచాంద: పొట్టపెల్లి నుంచి బయలుదేరుతున్న స్వాములు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి, లక్ష్మణచాంద గ్రామాల నుంచి హనుమాన్ స్వాములు ఆదివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. హనుమాన్ జయంతి రోజు వరకు చేరుకునేలా కాలినడకన వెళ్తున్నట్లు స్వాములు పేర్కొన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన 60 మంది స్వాములు ఆదివారం కొండగట్టు అంజన్నస్వామి దర్శనానికి పాదయాత్రగా బయలుదేరారు.

ఖానాపూర్: ఈనెల 23న హనుమాన్ జయంతి నేపథ్యంలో పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన హనుమాన్ దీక్షాపరులు ఆదివారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. ఈసందర్భంగా స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం వేర్వేరుగా తరలివెళ్లారు.

చిన్నారులకు వైద్యశిబిరం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు నరేశ్

కుభీర్: మండల కేంద్రంలో ఆదివారం భైంసాలోని అరుషి పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైద్యులు వంద మంది చిన్నారులను పరీక్షించి పలు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు డాక్టర్ బందెల నరేశ్, వడ్నం వసుందర్, ప్యాట ప్రణయ్, శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందెల దేవేందర్, కుభీర్ ప్రధానాచార్యులు హన్మాండ్లు, నాయకులు నగేశ్, లక్ష్మణ్, విజయ్, విఠల్, శంకర్, గణేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

భైంసారూరల్: ఎంపీడీవో సమావేశ మందిరంలో సోమవారం భైంసా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రజాక్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులంతా సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు. ఆయా శాఖల అధికారులు నివేదికలతో రావాలని సూచించారు.